1
నవతెలంగాణ
ఆదిలాబాద్
శుక్రవారం | అక్టోబర్ 20, 2023 | www.navatelangana.com

కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి

నవతెలంగాణ-సిరికొండ



నూతనంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నియామకమైన కుస్రం నీలాదేవి గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ - కాసిపేట



మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. పెద్దనపల్లి, సోమగూడెం(కె), కాసిపేట, ముత్యంపల్లిలోని అసెంబ్లీ పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో నాగరాజు, ఆయా పంచాయతీల కార్యదర్శులున్నారు.

పత్తి కొనుగోళ్లు ఎప్పుడు..?

- రైతుల ఇంటికి చేరిన పంట..ఖరారు కాని ముహూర్తం
- ఆధార్ అనుసంధానం ఉంటేనే విక్రయించేందుకు వీలు
- కొత్త నిబంధన తెరమీదకు తీసుకొచ్చిన ప్రభుత్వం
- సోయా కొనుగోలు లేక ప్రయివేటును ఆశ్రయిస్తున్న రైతులు
- తక్కువ ధరకు అమ్ముకుంటూ ఆర్థికంగా కుదేలు

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ముహూర్తం ఖరారు కావడం లేదు. ఇప్పటికే పంట ఇంటికొస్తుండటంతో రైతులు కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. కిందటేడాది ఇప్పటికే మార్కెట్ ప్రారంభం కాగా..ఈ ఏడాది మాత్రం ఇంకా ఆలస్యం కావడం రైతులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో పాటు ఇంకా సాఫ్ట్‌వేర్ కూడా సిద్ధం కాకపోవడంతో అధికారులు వేచిచూసే ధోరణి అవలంభిస్తున్నారు. మరోపక్క ఈ ఏడాది ప్రభుత్వం కొత్త నిబంధన తెరమీదకు తీసుకొచ్చింది. రైతుల బ్యాంకు ఖాతాలు, పట్టాపాస్‌బుక్ నెంబర్లకు ఆధార్ అనుసంధానం ఉంటేనే విక్రయించే వీలుంటుందని స్పష్టం చేస్తోంది. దీంతో వేలాది మంది రైతులు అనుసంధానం కోసం మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కిందటేడాది మాదిరిగానే ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కూడా రంగంలో ఉండాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క జిల్లాలో ఇప్పటికీ సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ప్రయివేటులో తక్కువ ధరకు విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పంట పత్తి. ఈ పంటపైనే ఆధారపడి లక్షలాది మంది రైతుల జీవితాలు ఆధారపడి ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 4.12లక్షల ఎకరాల్లో పత్తి పంట వేశారు. ఈ లెక్కన 28లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కిందటేడాది అక్టోబర్ 14వ తేదీనే పత్తి కొనుగోళ్ల ప్రారంభం కాగా..ఈ ఏడాది నెలాఖరు వరకు కూడా ప్రారంభం చేయకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పంట ఇంటికి రావడంతో మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు.ఈ ఏడాది ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020 కేటాయించింది. కింటేడాది క్వింటాల్‌కు రూ.6380 ఉండగా ఈ ఏడాది స్వల్పంగా ధర పెరగడం అన్నదాతలకు కొంత ఊరటనిస్తోంది. భారత పత్తి సంస్థ కిందటేడాది రంగంలో ఉన్నా..ప్రభుత్వ ధర కంటే ప్రయివేటులోనే అధికంగా ఉండటంతో కిలో పత్తి కూడా కొనుగోలు చేయలేకపోయింది. వాణిజ్యపరంగా రంగంలో ఉన్నప్పటికీ.. ప్రభుత్వ మద్దతు ధరకంటే కేవలం రూ.10, 20 మాత్రమే అధికంగా వెచ్చించడంతో రైతులెవరూ ఈ సంస్థకు విక్రయించడానికి సుముఖత చూపించలేదు.

మార్కెట్‌కు వచ్చింది తక్కువే..!

జిల్లాలో కిందటేడాది చేపట్టిన కొనుగోళ్లలో అతి తక్కువ పత్తి మార్కెట్‌కు వచ్చింది. ఈ ఏడాది లాగే దిగుబడి వచ్చినప్పటికీ.. మార్కెట్‌లో సీసీఐతో ప్రయివేటు వ్యాపారులు నిర్ణయించిన ధరకంటే ఇతర ప్రాంతాల్లో అధిక ధర పలికింది. మహారాష్ట్ర సరిహద్దున ఉండటంతో అక్కడి మార్కెట్లలో ఆదిలాబాద్ రేట్ల కంటే ఎక్కువగా ధర వెచ్చించారు. దీంతో సమీప గ్రామాల్లోని రైతులు ఆదిలాబాద్ మార్కెట్‌కు తీసుకురాకుండా మహారాష్ట్రకు పత్తిని తరలించారు. దీంతో కేవలం 9.14లక్షల క్వింటాల్‌ల పత్తి మాత్రమే మార్కెట్‌కు వచ్చింది. మరోపక్క కొందరు దళారులు ఆయా గ్రామాలకు వచ్చి అక్కడే తూకం వేసి మార్కెట్ ధర కంటే అధికంగా చెల్లించి పత్తి కొనుగోలు చేశారు. ఈ పత్తిని అధిక ధర ఉండే మార్కెట్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు.



ఈ ఏడాది కొత్త నిబంధన..!

పత్తి రైతులు పంటను అమ్ముకోవాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం కొత్త నిబంధన తీసుకొచ్చింది. రైతులు వారి బ్యాంకు ఖాతా నెంబర్, పట్టాపాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని సూచించింది. ఆధార్ నెంబర్ నమోదు చేయగానే రైతులకు సంబంధించి రైతులకు సంబంధించి సమస్త వివరాలు వెల్లడవుతాయని అధికారులు చెబుతున్నారు. మరోపక్క జిల్లాలో సుమారు 28వేల మంది వరకు కౌలు రైతులు ఉంటారని అధికారులు అంచనా వేశారు. వీరికి ఇప్పటికే వ్యవసాయశాఖ కూపన్లు అందజేస్తోంది. ఇలాంటి వారికి పట్టాదారు అకౌంట్‌ను జత చేసి అప్పటికప్పుడు తాత్కాల్ రిజిస్ట్రేషన్ చేయనున్నారు. కౌలు రైతులు పత్తిని విక్రయించిన తర్వాత వాటికి సంబంధించిన డబ్బులు పట్టాదారు ఖాతాల్లో జమ కానున్నాయని అధికారులు చెబుతున్నారు.

నష్టపోతున్న సోయా రైతులు..!

ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సోయా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది రైతులు సుమారు 90వేల ఎకరాల్లో సోయా పంట వేశారు. ఎకరానికి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అనుకుంటే.. 5.04లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4600 కేటాయించగా.. ఇంకా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. గత్యంతరం లేని పరిస్థితిలో అనేక మంది రైతులు తక్కువ ధరకు క్వింటాల్‌కు రూ.4300చొప్పున ప్రయివేటులో విక్రయిస్తున్నారు. దీంతో క్వింటాల్‌కు రూ.300చొప్పున నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి చెబుతున్నారు.

త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభం : శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్

మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లకు అవసరమైన ప్రక్రియను సిద్ధం చేస్తున్నాం. అతి త్వరలోనే సాఫ్ట్‌వేర్ కూడా అందుబాటులోకి రానుంది. ట్రయల్ రన్ పూర్తికాగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోళ్లకు ముహూర్తం ఖరారు చేస్తాం. రైతులు ఈ ఏడాది తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి. లేదంటే మార్కెట్‌లో పత్తిని విక్రయించడానికి వీలు ఉండదు. రైతులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని దోర్లితో పాటు పలు గిరిజన గ్రామాలలో ఏర్పాటు చేసిన యాంటీ లార్వా ఆపరేషన్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రీడింగ్ చెక్కర్ మునీశ్వర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలు, నీరు నిల్వ ఉన్నచోట తేమిపాస్ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షల కోసం నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్యామ్‌లాల్, ఎస్‌యూఓ శ్రీనివాస్, హెచ్ఈఓ రమేష్, హెచ్ఏ భగవాన్ దాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడ పడితే అక్కడ చెత్త చేస్తే జరిమానాలు : డీపీఓ

నవతెలంగాణ-సిరికొండ

దుకాణాదారులు చెత్తను ఎక్కడంటే అక్కడ పడేస్తే జరిమానాలు విధిస్తామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పర్యటించారు. ప్రతి షాప్ యజమాని పరిశుభ్రతను పాటించాలన్నారు. చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని కోరారు. అలాగే ప్రతి షాప్ యజమాని గ్రామ పంచాయతీ లైసెన్స్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్మద పెంటన్న, పంచాయతీ కార్యదర్శి అరుణ్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, ఉద్ధవ్ కోరారు. గిరిజన సంక్షేమం డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవితో సమావేశమైన అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పనిచేసిన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఎస్సీఆర్పీలకు ఇప్పటి వరకు ఈఎల్ మంజూరు చేయలేదని, వెంటనే వాటిని మంజూరు చేయాలని కోరారు. అర్హత కలిగిన ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులకు అలవెన్సులు మంజూరు చేయాలన్నారు. గత విద్యా సంవత్సరం ఆశ్రమ పాఠశాలలో ప్యానల్ తనిఖీ చేసిన ఉపాధ్యాయులకు టీఏ, డీఏ మంజూరు చేయాలన్నారు. విద్యార్థులకు రెండవ విడత పుస్తకాలను విద్యాశాఖ నుంచి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు విన్న డీటీడీఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ నాయకులు వామన్ రావు, పి భీమ్‌రావ్, సోమయ్య పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నవతెలంగాణ - దహెగాం

మండలంలోని కల్వాడ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీని చేపట్టారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, ప్రజలు నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రూక్‌చంద్, పోలీస్ సిబ్బంది సద్దార్, నారాయణ పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ




నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ దేవాలయంలో ఐదు రోజులుగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మాజీ సర్పంచ్ దిగువ స్వప్న శ్రీనూసింగ్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే బరిలోకి దిగేందుకు సిద్ధం..!

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లా ప్రజలకు ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేశామని, ఈసారి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సంజీవ్‌రెడ్డి నవతెలంగాణతో మాట్లాడారు. ప్రస్తుతం ఎమ్మెల్యే టికెట్‌కు సంజీవ్‌రెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. కంది శ్రీనివాస్‌రెడ్డికి తప్ప తమ ముగ్గురిలో టికెట్ ఎవరికిచ్చినా పార్టీని గెలిపించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా రాంచంద్రారెడ్డి ఉన్నప్పుడు ప్రజలకు ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు. పార్టీ అధిష్టానం తనకు అవకాశం ఇస్తే సీఆర్‌ఆర్ లాగా ఆదిలాబాద్‌ను మరింత అభివృద్ధి బాటలో నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రజలు, రైతుల పక్షాన ఉన్నది కాంగ్రెస్ పార్టీనే..!

గతంలో సీఆర్‌ఆర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన నాయకత్వంలో ఇందిరమ్మ ఇండ్లను దాదాపు 7వేలకు పైగా పేద ప్రజలకు అందించిన ఘనత తమదేనన్నారు. మావల పరిధిలోని 172 సర్వే నెంబర్‌లో ల్యాండ్ పర్చేజ్ స్కీంలో తానే జోక్యం చేసుకొని కొట్లాడి ఆ ప్లాట్లను దక్కించుకుని పేద ప్రజలకు అందించామన్నారు. ఆదిలాబాద్ రూరల్ పరిధిలో ఉన్న అటవీ భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చామని తెలిపారు. అలాగే లోన్లు ఇప్పించడంలో, లోన్లు మాఫీ చేయడంలో తన పాత్ర ఉందన్నారు. లోనింగ్ పట్టాలు ఇవ్వాలని అప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక జీవో తీసుకొచ్చారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 52 మండలాల్లో ఎక్కడ ఇవ్వని పట్టాలు, లోన్‌లు కేవలం ఆదిలాబాద్ రూరల్ మండలంలో తాను కొట్లాడి ప్రజలకు ఇప్పించానని పేర్కొన్నారు. అలాగే తాను మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఉన్నప్పుడు పత్తి కొనుగోలులో 8శాతం కంటే తక్కువ మాయిశ్చర్ ఉన్న కూడా అప్పటి కలెక్టర్ అహ్మద్ బాబుతో మాట్లాడి రైతులకు 3పర్సెంట్ ఇన్సెంటివ్ ఇప్పించిన ఘనత తనదేనన్నారు. మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా తాను పారదర్శకంగా పని చేశానని, తనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని తెలిపారు. 400 మంది కమీషన్ ఏజెంట్స్, 60, 70మంది పర్చేజ్ ఆఫీసర్లను ఎవరిని అడిగినా తన నిజాయితీ గురించి చెబుతారని పేర్కొన్నారు. తాను మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఉన్న కాలానికి ఇప్పటికి చాలా తేడా ఉందన్నారు. రాంచంద్రారెడ్డి మరణించేంత వరకు పార్టీ జెండా మోసి ఎలాంటి అవినీతికి తావు లేకుండా ప్రజల పక్షాన పోరాడారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, రైతుల పక్షాన నిలబడి అమరుడయ్యాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే సీఆర్‌ఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం చేశారు.

మాలీలు ఐక్యంగా ఉండాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

మాలీలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండి పోరాటాలు చేసినప్పుడే న్యాయం జరుగుతుందని మాలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వడాయి రవి అన్నారు. గురువారం మండలంలో మాలీల జెండా పండుగ వారోత్సవాలను పురస్కరించుకొని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నూతనంగా నిర్మిస్తున్న జ్యోతిబాపులే విగ్రహం నిర్మాణ ప్రాంతంలో జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి జెండా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మాలీలు ఐక్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కొన్నేండ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని అసెంబ్లీ సాక్షిగా తెలిపి తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించారని తెలిపారు. కానీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చకపోవడం విచారకరమని, ఇప్పటికైనా మాలీలపై బీజేపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపితే ఓట్ల ద్వారా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మోర్లె బాలాజీ, యువజన సంఘం అధ్యక్షుడు గుణవంత్‌రావు, రావన్‌పెల్లి ఉప సర్పంచ్ లెండుగురె శంకర్, వడాయి ఇస్తారు, సిండె బాలాజీ, గౌత్రె మనోహర్, గుర్నులే గణపతి, లెండుగురె భీంరావు, చౌదరి అబ్బాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జోగు రామన్నను నిలదీయాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత



నవతెలంగాణ-బేల

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినా ఎమ్మెల్యే జోగు రామన్న చేసిందేమీ లేదని, ఎన్నికల పేరుతో మరోమారు గ్రామాలకు వస్తున్న ఎమ్మెల్యేను నిలదీయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు.

అనంతరం మీడియాతో మాట్లాడారు. 2018 మేనిఫెస్టోలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందని మండిపడ్డారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే తాను మాత్రం దీపాయిగూడ నుండి మొదలుకొని హైదరాబాద్ వరకు ఎన్నో ఇండ్లు కట్టుకున్నారని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్‌కు ఈసారి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

పేదలకు రేషన్ కార్డు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ అభ్యర్థినిగెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి రాందాస్ నాక్లే, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్, అఖిల్, మడావి చంద్రకాంత్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ విపిన్ ఠాక్రే, కన్య రాజు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి : సీడీపీఓ సురేఖ



నవతెలంగాణ - దహెగాం

అంగన్‌వాడీ సెంటర్లలో సమయపాలన పాటించాలని సీడీపీఓ సురేఖ అన్నారు. గురువారం మండలంలోని పీపీరావు కాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో సమయపాలన పాటించడం లేదని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సందర్శించానని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను నిర్ణీత సమయంలో తెరిచి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, అంగన్‌వాడీ కార్యకర్త జయప్రద, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాడిహత్నూర్ టీజీబీ బ్రాంచ్ మేనేజర్ ఆంబోతు శ్రీనివాస్ అన్నారు. గురువారం నాగల్‌కొండ, ముక్తాపూర్ గ్రామాల్లో కళాజాత ద్వారా ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారులకు బ్యాంక్ అందిస్తున్న వివిధ సేవలను వివరించారు. బ్యాంక్ ద్వారా అందించే బీమా పథకాలు, క్రాప్‌లోన్, డ్వాక్రా



మహిళ సంఘాల రుణాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు చెల్లించిన వారికి కొత్త రుణాలు మంజూరు చేస్తామని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ పి.సునీల్, గ్రామపటేల్ భొజ్జు, నాగుబాయి, బ్యాంక్ సిబ్బంది శాబీర్, సీఎస్‌సీ నిర్వహకులు ఫడ్ రవీందర్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై యాసిత్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం... దిలావర్‌పూర్ బస్టాండ్ సమీపంలో నాఖా బందిలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి ఏపీ 25వి 5617 అనే నెంబరు గల ఆటోలో సోదాలు చేశామని, ఆ ఆటోలో లక్ష్మయ్య అనే వ్యక్తి కద్తాల్ గ్రామం నుంచి భైంసా వైపు తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నామని తెలిపారు. తదుపరి చర్యల్లో భాగంగా నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ సమీక్షంలో తహసీల్దార్ సరితకు అప్పగించామని తెలియజేశారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.



ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి



నవతెలంగాణ-తాంసి

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. గురువారం మండలంలోని పొన్నారి గ్రామంలో ఎంపీపీ జెడ్పీటీసీలతో పాటు మండలానికి చెందిన అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను తన మేనిఫెనిస్టోని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ఇప్పుడు ప్రవేశపెట్టిన నూతన మేనిఫెస్టో అందరికీ ఉపయోగపడేలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అరుణ్, మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, అశోక్, రమణ, కృష్ణారెడ్డి, సదానందం, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

8వ రోజు పల్సి గ్రామస్తుల నిరాహార దీక్ష



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాటితో 8వ రోజుకు చేరుకుంది. 8వ రోజు దుర్గ మాతా స్వాములతో కొనసాగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ఏండ్ల కిందటే గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు, అధికారులకు, విన్నవించామని అన్నారు. మండలంగా ప్రకటిస్తామని చెప్పి, మోసగించి వేరే గ్రామాన్ని మండలంగా ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్సి గ్రామాన్ని మండలంగా ప్రకటించే వరకు నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుర్గమాత స్వాములు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

రూ.90 వేల నగదు పట్టివేత



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని లక్ష్మీపూర్ అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర వాసి నుంచి రూ.90వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కిన్వట్ నుంచి ఆదిలాబాద్ వెళుతున్న ఎంహెచ్ 26 బీఎక్స్ 7702 కారులో పట్టుపడ్డట్టు తెలిపారు. నాందేడ్ జిల్లా, కిన్వట్ తాలుకా, కోప్ర గ్రామానికి చెందిన మాస్కాన్ పటాన్ ఆదిలాబాద్‌కు వస్తున్నట్టు తెలిపారు. వాహనంలో రూ.90వేలు దొరకగా అట్టివాటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం అధికారి ఆడే మధుసూదన్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీఎస్ఓ, ఏఎస్సై సురేందర్, ఎక్సైజ్ సిబ్బంది పోచ్చన్న ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి



నవతెలంగాణ-ముథోల్

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్ అన్నారు. మండలంలోని బ్రహ్మణ్‌గావ్ గ్రామంలో గురువారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గత పది సంవత్సరాలుగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గ్రామాలను అభివృద్ధి చేయడంలో ముందున్నారని అన్నారు. ముథోల్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం ఎమ్మెల్యే కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామ్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోనిలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి వద్ద రూ.7లక్షలు ఉన్నట్టు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లిన సీజ్ చేయడం జరుగుతుందన్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు ప్రజలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

ఇవ్వని హామీలను అమలు చేశాం

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి సామాన్య ప్రజానికానికి అండగా నిలిచిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం మండలంలోని తంతోలి గ్రామంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశ సభను నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ 50 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ అభివృద్ధి చేయాలేదని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రజల కోసం సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోని ఎక్కడలేని విధంగా అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మళ్లీ సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే జోగు రామన్నను అత్యధిక మెజార్టీతో



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, గ్రంధాలయ సంస్థ చైర్మెన్ మనోహర్, మండల అధ్యక్షుడు గండ్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, ఎంపీటీసీ సేవ్వ లక్ష్మి జగదీష్, మార్కెట్ చైర్మెన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, ఆత్మ చైర్మెన్ జిట్ట రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు యూనిస్ అక్బాని, యాసం నర్సింగరావు, రమణ, గంగయ్య, సర్పంచ్ మడవి లక్ష్మీబాయి, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-దస్తురాబాద్

తనను గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ భరోసా ఇచ్చారు. గురువారం మండలంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులు జాన్సన్ నాయక్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయని అన్నారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కొరకే సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తేవడానికి, ప్రతి కార్యకర్త నాయకుడు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ కుటుంబంలో ఒకరిగా ఉండి, భారీ మెజారిటీతో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని దిశ నిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ముడికే ఐలయ్య, ప్రధాన కార్యదర్శి అరుగుల రాజా నర్సయ్య, ఎంపీపీ సింగారి కిసాన్, జెడ్పీటీసీ శారదా శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు సిర్ప సంతోష్, ఆత్మ కమిటీ చైర్మెన్ అప్పని రాజు, పీఏసీఎస్ చైర్మెన్ రమేష్‌రావు, ఖానాపూర్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గోవర్ధన్, సుధాకర్, సర్పంచులు శివయ్య, శంకర్, భూమేష్, బాదం లక్ష్మీరాజాం, నాయకులు వావిలాల రాము, మంతెన సత్తన్న, కిషోర్, మల్లికార్జున్, వంశీ, సర్వ నర్సయ్య, విజయ్, కమలాకర్, గంగన్న పాల్గొన్నారు.



రక్తదానం చేసిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం అమరవీరుల స్తూపం చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి అమరవీరులకు పూలతో నివాళులర్పించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి స్వయంగా ఎస్పీ రక్తదానం చేసి సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 57 మంది పోలీసుల ప్రాణత్యాగాలు ఇప్పుడు ప్రశాంతమైన జిల్లాకు కారణమన్నారు. వారి సంస్మరణ సందర్భంగా ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో 57 మంది పోలీసు అమరవీరుల ముఖచిత్రాలతో నూతన స్తూపాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో సరైన సమయంలో రక్తం అందక తలసేమియా వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం చేసిన వారు ప్రాణదాతలతో



రక్తదానం చేస్తున్న ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి

సమానమన్నారు. అనంతరం ఇటీవల అగ్నివీర్‌కు ఎంపికైన పట్టణానికి చెందిన నిఖితను ఎస్పీ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సి.సమయ్ జాన్‌రావు, ఆదిలాబాద్, ఉట్నూర్ డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్ నాగేందర్, వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు కే.సత్యనారాయణ, ఏ.అశోక్, ప్రణయ్ కుమార్, చంద్రశేఖర్, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నవీన్ కుమార్, మురళి, కార్తీక్, స్వామి రిమ్స్ డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు అన్యాయం



కాంగ్రెస్ పార్టీలో చేరిన చించోలి(బి) ఎంపీటీసీ వెంకట్ రామ్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో అన్యాయం చేశారని నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. గురువారం సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన ఉద్యమకారుడు ఎంపీటీసీ వెంకట్ రామ్‌రెడ్డి అధికార బీఆర్ఎస్ పార్టీకి గురువారం రాజీనామా చేసి జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో రాష్ట్రాన్ని సాధించుకుంటే అధికారంలోకి వచ్చిన కేసీఆర్ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలేని అసమర్థత సీఎం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు చేసింది ఏమీ లేదని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా సకాలంలో వేతనాలు ఇవ్వలేని ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి బహుమతి ఇద్దామని అన్నారు. నిర్మల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు వార్డు సభ్యులు...

సారంగాపూర్ మండలంలోని కంకెట గ్రామ అధికార పార్టీకి చెందిన వార్డు సభ్యులు గంగామణి, జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, రొడ్డ దేవన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటున్నారని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

గర్భిణులకు అల్పాహారం పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో బ్ల్యూ భీమ్ యూత్ అధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణీలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు గోంటి ముక్కుల ప్రేమేందర్ మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలో భాగంగా గర్భిణులకు అల్పాహారం పంపిణీ చేయడం జరిగిందనీ అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాల చేస్తూ అందరి సహాయ సహకారాలతో ముందుకు వెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరీష్, భూమన్న, యూత్ అధ్యక్షులు ప్రేమేందర్, సభ్యులు శేఖర్, ప్రసాద్, వంశీ, నాని, అనిల్, గంగాధర్ బ్ల్యూ భీమ్ యూత్ సభ్యులు, వైద్య సిబ్బంది, గర్భిణీలు పాల్గొన్నారు.

ఉరేసుకొని రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆలూర్ గ్రామానికి చెందిన గురిజల చిన్నయ్య(60) రైతు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు కొంత కాలంగా మద్యానికి అలవాటు పడ్డాడు. బుధవారం మత్తులో తన పక్క చేను ప్రక్కనే ఉన్న మోతుకు చెట్టుకు నైలాన్ తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా 66 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాల పత్రాలను పరిశీలించన తదుపరి సరైన పత్రాలు లేని వాహనాలకు, లైసెన్స్ లేని వారికి, వాహనాలపై చాలాన్లు ఉన్నవారికి జరిమానా విధించారు. నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఎల్లవేళలా తమ వాహనాలకు సంభందించిన అన్ని పత్రాలు, లైసెన్స్ తమ వద్ద ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. సెల్ ఫోన్ వాడకం ఎక్కువైన తరుణంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, సైబర్ క్రైమ్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలని పలు సూచనలు చేశారు. ఇట్టి కమ్యూనిటీ కాంటాక్ట్, నర్సాపూర్(జి) ఎస్సై రవీందర్, దిలావర్‌పూర్ ఎస్సై యాసిత్ అరాఫత్, సారంగాపూర్ ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి, నిర్మల్ రూరల్ ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న డీసీసీబీ వైస్ చైర్మెన్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి గురువారం మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన సొంత డబ్బులతో షెడ్డు నిర్మించినందుకు ఆయనకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, నాయకులు చిన్నారెడ్డి, నరేష్, సురేష్, శంకర్, ప్రసాద్, సాయన్న పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై శిక్షణ తరగతులు



నవతెలంగాణ-బోథ్

ఎన్నికల నేపథ్యంలో అధికారులకు ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్, డిప్యూటి తహసీల్దార్‌లకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అధికారులు వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల తహసీల్దార్, డిప్యూటి తహసీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మున్సిపల్ కార్మికులు వివిధ డిమాండ్లతో 11 రోజులుగా చేపట్టిన సమ్మెను గురువారం విరమించారు. మూడు నెలల బకాయి వేతనాలు, రూ. 1.50 కోట్ల పీఎఫ్, ఈఎస్ఐ రూ. 1.25 కోట్లు చెల్లించాల్సి ఉండగా వాటిని తక్షణమే పరిష్కరించాలనే డిమాండ్ చేస్తూ సమ్మె చేశారు. బుధవారం నుంచి పికెటింగ్ నిర్వహించారు. కార్యాలయంలోకి ఎవ్వరూ వెళ్లకుండా మూసివేశారు. ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ అంజయ్య కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపారు. రెండు నెలల వేతనాలు కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని, దీపావళిలోపు మరో నెల వేతనం చెల్లిస్తామని, ప్రతీ నెలా వేతనాలు సక్రమంగా చెల్లించేందుకు కృషి చేస్తామని, సమ్మె కాలానికి సైతం వేతనం చెల్లిస్తామని కమిషనర్ భరోసా ఇవ్వడంతో సమ్మె విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షురాలు ఆర్.త్రివేణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శంకర్, మల్లేష్, రమేశ్, శంకరమ్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | అక్టోబర్ 20, 2023 | www.navatelangana.com

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఝరి గ్రామపంచాయతీలోని టొక్కిగూడ గ్రామానికి చెందిన గ్రామస్తులు గురువారం బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం ఝరి మాజీ సర్పంచ్ జనక్ ఆధ్యర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరగా వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు పేద ప్రజలకు అండగా ఉంటూ సంక్షేమ ఫలాలు అందేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. గెలుపు కోసం తమవంతు సహకారం అందిస్తామని పార్టీలో చేరిన వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హన్మంతు, మాజిక్, శేఖర్, రవీందర్, సందీప్, కుమార్, విఠల్, లక్ష్మణ్, జైరాం, లక్ష్మణ్, చందర్, సకారాం, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.3.50లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని సిరిపెల్లి గ్రామం వద్ద గురువారం ఎన్నికల నియమావళిలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మహారాష్ట్ర బోకర్‌కు చెందిన గణేష్ తన బోలేరో వాహనంలో వస్తుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వద్ద రూ.3లక్షల 50వేల నగదు ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నట్టు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. వీటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. అదే విధంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఈ తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ లేని సిగరెట్లు అమ్మడం నేరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మార్పీ లేని సిగరెట్లను అమ్మడం నేరమని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీధర్ మెటిపెల్లివార్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్, నేతాజీ, వినాయకచౌక్, గాంధీ పార్క్ ప్రాంతాల్లో జిల్లా పొగాకు నియంత్రణ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు అమ్మే పొగాకు ఉత్పత్తులపై మ్యానుఫ్యాక్చరింగ్ తేదీ, ఎమ్మార్పీ ఇతర పూర్తి సమాచారం ఉండాలన్నారు. బహిరంగ ధూమపానం నేరం అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమతి లేని పొగాకు ఉత్పత్తులు నమ్మిన వారిపై కోట్ప యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమన్నారు. ఈ సందర్భంగా నిబంధనలను అతిక్రమించి అనుమతి లేని పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న ముగ్గురు దుకాణ యజమానులకు జరిమానాలు విధించారు. ఆయన వెంట తనిఖీ బృందం సభ్యులు శ్రీకాంత్, క్లినికల్ సైకాలజిస్ట్, సోషల్ వర్కర్ చిరంజీవి, కానిస్టేబుల్ ప్రభాకర్ ఉన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేయాలి



నవతెలంగాణ-బోథ్

రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా రాష్ట్ర నాయకత్వం పని చేస్తుందని, దానికి అనుగుణంగా నియోజకవర్గంలో కార్యకర్తలు ముందుకు సాగాలని బోథ్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటీ కార్డుల గురించి వివరించారు. నియోజకవర్గంలో ఇంకా అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో ఇప్పటి నుంచే శ్రేణులు పార్టీ పరంగా ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థి ఎవరైన పార్టీ కోసం పని చేస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సల్ల రవి, నియోజకవర్గ మైనార్టీ సెల్ కార్యదర్శి, ఎంపీటీసీ షేక్ రజియా బేగం నాజర్ అహ్మద్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ రహిమొద్దీన్, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ హసిఫ్, తబ్రేజ్ పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి ఆకుల రాము దరఖాస్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీడీపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం ఆకుల రాము దరఖాస్తు చేసుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ నియోజకవర్గం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఆకుల రాము అభ్యర్థిత్వాన్ని పరిగణిలోకి తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందించారు. గతంలో పార్టీ బీసీ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రాతినిధ్యం కల్పించి ఎమ్మెల్యే మంత్రులుగా చేసిన ఘనత ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన తనకు ఇవ్వాలని కోరారు. దీనిపై రాష్ట్ర అధ్యక్షులు సానుకూలంగా స్పందించి పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందని, పని చేయాలని సూచించినట్టు తెలిపారు. ఆయన వెంట పార్లమెంట్ కార్యదర్శి గంగసారపు ఓమన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, టీఎన్టీయూసీ అధ్యక్షులు భాను రాజేశ్వరరావు, మావల మండల అధ్యక్షులు తోకల లక్ష్మన్న, మండల నాయకులు నరేందర్, ఆరె రాజన్న ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-భైంసా

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు, నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటు హక్కు పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 18 సంవత్సరాల నిండిన వారు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. సామాన్యులు రూ.50 వేల కంటే ఎక్కువ బయట తీసుకురావద్దని కోడ్ అమలులో ఉన్నందున ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పండుగ ఉత్సాహాన్ని నింపారు. ఓటరు అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా అధికారులను అభినందించారు.



ఏఎస్పీ, మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో కలెక్టర్

కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఆర్డీఓ విజయలక్ష్మి ఐకేపీ సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు సిబ్బంది, ఈజీఎస్ అధికారులు సిబ్బందితో పాటు, ఎంపీడీఓలు, డీపీఆర్వో తిరుమల పాల్గొన్నారు.

గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి సంస్థలో 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న విద్యావాలంటీర్లకు గౌరవ వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలో ఓపెన్‌కాస్టులో భూములు కోల్పోయిన పీడీఎఫ్ బాధితులు ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఓపెన్‌కాస్టులకు భూములిచ్చి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న వీరి పాత్ర అత్యంత కీలకమైందన్నారు. 15 సంవత్సరాల నుంచి బెల్లంపల్లి ఏరియాలో ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో సేవా సమితి ద్వారా విద్యావాలంటీర్లుగా పనిచేస్తున్నారని, వీరికి కేవలం రూ.ఐదు వేలు వేతనం చెల్లిస్తున్నారని, దీనివల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గౌరవ వేతనం పెంచాలని సింగరేణి యాజమాన్యానిక అనేక సార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వీరికి గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేనిపక్షంలో వీరు రోడ్డున పడే అవకాశాలున్నాయన్నారు. చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న విద్యావాలంటీర్లకు వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గం రమేష్, స్వప్న, సింధూజ పాల్గొన్నారు.

రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి

నవతెలంగాణ-తలమడుగు

వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం మండలంలోని భరంపూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతులతో కలిసి మాట్లాడారు. గత ఏప్రిల్ నెలలో తలమడుగు, తాంసి, భీంపూర్, మండలాల్లో కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు కూడా నష్టపరిహారం అందని దుస్థితి కనిపిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.ఒక కోటిని విడుదల చేసిన, ట్రెజరీలో సమస్య ఉందని, మన జిల్లా కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ, అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినప్పటికీ స్పందన లేదని అన్నారు. మన జిల్లాలోని కొన్ని వందల మంది రైతులు పంట నష్టపోయినా రైతులకి ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ గత జులై 21, 22, 26, 27 తేదీలలో అతి భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలను ఇంత వరకు కూడా సర్వే చేయకపోవడం మూలంగా మన జిల్లా మొత్తం మీదుగా 57 వేల ఎకరాల



పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చిన తాత్కాలిక రిపోర్ట్ ఆధారంగా నష్టపోయినా రైతులకి పరిహారం అందించే విధంగా ప్రయత్నం చేయాలనీ అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతులు విఠల్, నారాయణరెడ్డి, అభిలాష్, ప్రతాప్, కిష్టారెడ్డి, మల్లేష్, భరంపూర్ గ్రామ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పథకాలు సాధించడం గర్వకారణం



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన విద్యార్థులు అథ్లేటిక్స్‌లో జాతీయ స్థాయిలో పథకాలు సాధించడం గర్వకారణమని ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఇటీవల వరంగల్‌లో జరిగిన అథ్లేటిక్స్ అండర్-14లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి, బహుమతులను అందించి స్వీట్లు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండర్-14 అథ్లేటిక్స్‌లో గిరిజన విద్యార్థులు పరశురాం, సతీష్ జాతీయ స్థాయిలో రాణించడం గొప్పవిషయమని అన్నారు. జాతీయ స్థాయిలో పథకాలు సాధించడం వల్ల జిల్లా, ఐటీడీఏ, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చారన్నారని కొనియాడారు. ఈ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, మరిన్ని పథకాలు సాదించేలా ఐటీడీఏ ద్వారా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. వీరిని గిరిజన విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏపీఓ పీవీటీజీ భాస్కర్, ఏఓ రాంబాబు, ఏసీఎంఓ జగన్, ఏటీడీఓ క్రాంతి, సిబ్బంది ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ సమావేశంలో జిల్లా అధికారులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మద్యం నియంత్రణపై సరిహద్దు రాష్ట్రాల అధికారులతో ఆదిలాబాద్‌లో గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల్లో మద్యం నియంత్రణకు ఎక్సైజ్ అధికారులు ఒకరికొకరు సహకరించుకోవాలని, పక్క రాష్ట్రాల అధికారులు కూడా తమకు సహకరించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల అధికారులతో పాటు, మహారాష్ట్రలోని నాందేడ్, యవత్మాల్, చంద్రాపూర్, గడ్చిరోలీ జిల్లాల ఎక్సైజ్ అదికారులు, జిల్లా నుంచి ఆసిఫాబాద్ సీఐ మోసిన్ అలీ పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి.. మరింత అభివృద్ధి చేస్తా

నవతెలంగాణ-ముధోల్



మరోసారి అవకాశం ఇస్తే ముధోల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రువ్వి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గ్రామాలను అభివృద్ధి చేసేలా కృషి చేశానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, రైతుబంధు మండల అధ్యక్షుడు రామ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంగాధర్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ లాలబాయి పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపాలను బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సంధర్భంగా మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించి, ఊరేగింపుగా బయలుదేరి బోనాల ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, కరిపే విలాస్, చంద్ర ప్రకాష్‌గౌడ్, ఎంపీటీసీ పద్మ వీరయ్య, మాజీ ఎంపీపీ చెన్న లక్ష్మి రాజేశ్వర్, గుంటుకు నవీన్, సాహెబ్ రావు, ముత్యం రెడ్డి, నారాయణ, మహేష్‌రెడ్డి, తేజు నాయక్, తిరుమలచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కొనసాగుతున్న అనుమతి లేని అక్రమ వెంచర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. కలెక్టర్ బొర్కాడే హేమంత్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో కబ్జాదారులు ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్నారని అట్టి ప్రభుత్వ భూములు కబ్జా చేసి వెంచర్లు వేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంతో పోలిస్తే జిల్లా కేంద్రం ఎంతగానో అభివృద్ధి చెందిందని దీన్ని ఆసరాగా చేసుకొని అక్రమణ దారులు బీడీపీపీ ఇనాం అసైన్డ్ భూములు ఆక్రమిస్తున్నారన్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా అనుమతులు లేకుండా వెంచర్లు వేసిన వారిపై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అంతే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పరోక్షంగా అక్రమ ప్లాట్‌లకు నంబర్ల ఇస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముక్త సాళ్వే జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 29న నార్నూర్ మండలం తాడిహత్నూర్‌లో నిర్వహించే ముక్తా సాళ్వే 183వ జయంతి ఉత్సవాలకు నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా పూలే ఫ్రీ ప్రైమరీ పాఠశాలలో బ్రిటిష్ కాలంలో చదివిన మొట్టమొదటి దళిత మహిళ ముక్త సాళ్వే అని కొనియాడారు. దళిత మహిళలకు చదువు అవసరాన్ని తెలిపిన ఆమె జయంతి వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాణ కమిటీ సభ్యులు గోపాల్, సత్యపాల్, రాజు, ఏకనాథ్, ఉమాకాంత్ పాల్గొన్నారు.

లలిత సహస్రనామ పారాయణం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారద గణేష్ మండలి వద్ద దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు బతుకమ్మ వేడుకలకు విరామం ఉండడంతో మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేపట్టారు. లలిత సహస్రనామ పారాయణానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రెండు గంటల పాటు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి కమిటీ అధ్యక్షుడు పుల్లూరు రవి, సభ్యులు గీత, అశ్విన్, మంగ, విలాస్, వివేక్, శ్రీనివాస్, రజిని, మహేందర్, శిరీష, ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.1.98లక్షలు సీజ్



నవతెలంగాణ-వాంకిడి

మడలంలోని ఇందాని ఎక్స్‌రోడ్డు వద్ద చేపడతున్న వాహనాల తనిఖీలో భాగంగా గురువారం మహారాష్ట్రలోని రాజూరా నుంచి మంచిర్యాల వైపుకు వెళ్తున్న కారులో రూ.1.98 లక్షలు పట్టుకొని సీజ్ చేసినట్టు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లినట్టయితే వాటికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా తమవద్ద ఉంచుకోవాలని, లేనిపక్షంలో డబ్బులను సీజ్ చేస్తామన్నారు. డబ్బులు, మద్యం, మాధకద్రవ్యాలు రవాణా చేస్తే పట్టుకొని కేసులు నమోదుచేస్తామన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని యువతి అదృశ్యం కేసు నమోదయ్యింది. గురువారం ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 20 ఏండ్ల యువతి హర్ష బేగర మూడు రోజుల నుంచి కనిపించడం లేదు. యువతి అన్నయ్య మహమ్మద్ సుమేర్ చుట్టూ పక్కల గ్రామాలు, కుటుంబీకుల ఇండ్లలో చూశాడు. ఆచూకి లభించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చింతగూడాలో డీపీఓ ఆకస్మిక పర్యటన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతగూడ గ్రామంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ప్రభాకర్‌రావ్ ఆకస్మికంగా పర్యటించి గ్రామపంచాయతీ పనితీరును పరిశీలించారు. గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం జరిగేలా చూడాలని, తడిపొడి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలన్నారు. రోడ్లు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో అన్ని లోకేషన్లలో 100 శాతం మొక్కలు బ్రతికేల చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రమేష్, సర్పంచ్ ఆరే జ్యోతి శిరీష్ పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రజలు, వ్యాపారులు చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మండలంలోని పోన్కల్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాహుల్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక ప్రధాన రహదారి పక్కన చెత్త వేసిన ఇద్దరు వ్యాపారులకు ఆయన జరిమానా విధించారు. చెత్తను సేకరించేందుకు పంచాయతీ ట్రాక్టర్లు వస్తాయని, పంచాయతీ కార్మికులకు చెత్తను ఇవ్వాలని వ్యాపారులకు, ప్రజలకు ఆయన సూచించారు.

జోరుగా సాగుతున్న పేకాట, కోడిపందాలు

42 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

- రూ.2.5 లక్షలతో పాటు 12 కార్లు స్వాధీనం



చెన్నూరులో పోలీసులు స్వాధీనం చేసుకున్న 43 సెల్ ఫోన్‌లు

నవతెలంగాణ-చెన్నూర్

పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి రూ.2.51లక్షల నగదు, 12 కార్లు, 43 ఫోన్లను స్వాధీనం చేసుకొని 42 మందిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున పట్టణ శివారులో గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పట్టణ శివారులోని గోదావరి రోడ్డులో గల గోదావరి నది ఒడ్డున కొంత మంది వ్యక్తులు పేకాట(అందర్ బాహర్) ఆడుతున్న వారిపై దాడి చేసి 42 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ ఎస్ వాసుదేవరావు తెలిపారు. గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం, బెల్లంపల్లి, మందమర్రి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన 42 మంది వ్యక్తులను అరెస్టు చేసి నగదుతోపాటు వాహనాలు, సెల్ ఫోన్‌లు రెండు ఛార్జింగ్ లైట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ-మంచిర్యాల

దసరా పండగ సందర్భంగా హాజీపూర్ మండలంలో పేకాట, కోడి పందాలు జోరుగా సాగుతున్నాయి. పెద్దంపేట్ గ్రామ వేదికగా ఈ దందా జోరుగా సాగుతోంది. ఇదంతా పోలీస్‌లకు తెలిసే జరుగుతున్నట్లు మండలంలో చర్చ జరుగుతోంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన జూదరులకు భయం లేకుండా పోతోంది. ఇదే కాకుండా మండలం నుంచి ఛత్తీస్‌ఘడ్, సిరోంచ ప్రాంతాలకు భారీగా పందెం రాయుళ్లు కోడి పుంజులతో వెళ్తున్నట్లు సమాచారం. గత నెల జైపూర్ పోలీస్‌లు మండలంలోని కోడి పందెం రాయుళ్ళను పట్టుకొని అక్కడి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇక్కడి నుంచి పందెం రాయుళ్లు ఇతర ప్రాంతాలకు వాహనాల్లో కోడి పుంజులతో వెళ్తున్న సమాచారం స్థానిక పోలీస్‌లకు తెలిసి కూడా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- పట్టుబడ్డ వారిని వదిలేస్తున్న పోలీసులు



చెన్నూర్‌లో పోలీసులు సీజ్ చేసిన 12 కార్లు

పట్టుకొని వదిలేసుడేనా..?



బుధవారం నర్సింగపూర్ గ్రామ శివారు రాజేశ్వర్‌రావు పల్లె రైస్ మిల్ ప్రాంతంలో స్థానిక పోలీస్‌లు దాడులు చేసి పెద్దఎత్తున నగదుతో పాటు 6 గురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వదిలేసి నట్లు సమాచారం. ఇందులో ఆ గ్రామ మాజీ ప్రజాప్రతినిధి భర్తతో పాటు బీఆర్ఎస్ నాయకులు వున్నారని తెలుస్తోంది. వీరిని అదుపులోకి తీసుకున్న పోలిస్‌లు బుధవారం ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. గతంలో మండలంలోని మంచిర్యాల గార్డెన్స్‌లో కూడా పేకాట స్థావరంపై పోలీస్‌లు దాడి చేసిన ఘటనలో ఎంత నగదు రికవరీ చేశారనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగా మిగిలింది. ఇదీ కాక ఎన్నికల కోడ్ అమలులోకి వున్న కానీ అధికార పార్టీ నాయకులకు పోలీసులు సపోర్ట్ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర అతి ముఖ్యమైనదని, అప్రమత్తంగా ఉంటూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సెక్టార్ అధికారులతో ఈవీఎం, వీవీ ప్యాట్లపై 2వ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైనదని, సెక్టార్ అధికారి తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని, ఈవీఎం, వీవీ ప్యాట్లు, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు, ఎన్నికల రోజున తమకు కేటాయించిన రూట్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. సెక్టార్ అధికారులు తమ సెక్టార్ పరిధిలోని రహదారులు, వాగులు, కల్వర్టులకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నా, తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఏమైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే రిటర్నింగ్ అధికారికి వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. ఈవీఎంలలో సమస్య తలెత్తితే రిజర్వు ఈవీఎంలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కంపెనీ లెవెల్ హాకీ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-మంచిర్యాల

కంపెనీ లెవెల్ హాకీ పోటీలను శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి గురువారం ప్రారంభించారు. ఒలంపిక్ జెండాను ఆవిష్కరించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల హాకీ క్రీడాకారులు ఈరోజు కంపెనీ స్థాయి పోటీలలో పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమని, క్రీడాకారులందరూ పోటీలలో తమ యొక్క ప్రతిభను చాటాలని అన్నారు. అలాగే కోల్ ఇండియా స్థాయిలో సింగరేణికి మంచి గుర్తింపు తీసుకు రావాలని సూచించారు. క్రీడలలో పాల్గొనడం వలన మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని తెలియజేశారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల నుంచి 6 జట్లు పోటీలో పాల్గొన్నారు. ఎస్ఓ టూ జీఎం రఘుకుమార్ మాట్లాడుతూ క్రీడాకారులందరూ గెలుపు ఓటములపై ఆలోచించకుండా ఆటలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. హాకీ పితామహుడు ధ్యాన్ చంద్ హాకీలో భారతదేశానికి అనేక బహుమతులను అందించిన గొప్ప క్రీడాకారుడని, అలాగే ఒలంపిక్స్‌లో భారతదేశానికి వరుసగా మూడుసార్లు బంగారు పథకాలు సాధించడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(ప) పి.అరవింద రావు, స్పోర్ట్స్ హానరరి సెక్రటరి పాలకుర్తి రాజు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, ఇన్‌ఛార్జి స్పోర్ట్స్ మేనేజర్ జాన్వెస్లీ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తోట సురేష్, హాకీ శ్రీరాంపూర్ ఏరియా కెప్టెన్ తిరుపతి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం రవి

నవతెలంగాణ-మంచిర్యాల(నస్పూర్)

విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం రవి అన్నారు. అక్టోబర్ 29, 30 తేదీలలో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర 2వ మహాసభల గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందని, పాలకులు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఏఐవైఎఫ్‌కు ఉన్నదని వారు పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఈ మహాసభలలో నిర్దిష్టంగా చర్చ జరుగుతుందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ మహాసభలు ప్రాచుర్యాన్ని సంతరించుకోనున్నట్లు తెలిపారు. పాలకులకు ఉపాధి అంశాల పట్ల నిర్దిష్ట అవగాహనలేమితో వ్యవహరిస్తోందని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మహాసభల్లో యువతకు నిరుద్యోగులకు జరుగుతున్నటువంటి అన్యాయంపై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. అలాగే భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమాలకు కొలువైన హైదరాబాద్‌లో రాష్ట్ర మహాసభలకు వేదిక కానున్నాయని, ఈ మహాసభలను యువత, మేధావులు, పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు ముత్తునూరు మహేష్, పర్వా శ్రీనివాస్, విజయ్, దేవి పోచన్న, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నీళ్లు నిధులు నియామకాలు అనే నినాదంతో సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగ యువతను మోసం చేసిన ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ హెచ్చరించారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్ర సాధన సాధ్యమైతే తమ జీవిత కాల కల అయిన ఉద్యోగ సాధన నెరవేరుతుందని భావించారన్నారు. రాష్ట్ర సాధన సమయంలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నో సందర్భాల్లో కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర సాధన కల నెరవేరి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ నిరుద్యోగుల కల నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై ప్రభుత్వం శ్రద్ధ చూపక పోగా వేసిన నోటిఫికేషన్లు లీకేజీలతో రద్దు కావడంతో యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లాకు రావలసిన యూనివర్సిటీని ములుగు జిల్లాకు తరలిస్తున్నారని దీనిపై ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరుద్యోగ యువత గమనిస్తుందని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష గేడం టీకానంద్, జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్, నిఖిల్ పాల్గొన్నారు.

బతుకమ్మ పాటను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని శ్రీరాఘవేంద్ర విద్యా సంస్థల ఆధ్వర్యంలో రూపొందించిన జువ్వియాలో బతుకమ్మ పాటను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. గురువారం హైదరాబాదులో జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, విద్యాసంస్థల కరస్పాండెంట్ సంపత్ కుమార్ విద్యార్థులతో ఎమ్మెల్సీని కలిశారు. ఈ సందర్భంగా ఆమె జువ్వియాలో బతుకమ్మ పాట సీడీని ఆవిష్కరించి నిర్వాహకులను అభినందించారు. ప్రతి సంవత్సరం మహిళల ఆడుకునే బతుకమ్మ పాటను తెలంగాణ సాంస్కృతికి అద్దం పట్టే విధంగా పాటను రూపొందించడం పట్ల పాట రూపొందించిన బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

21న టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-కాసిపేట

ఈ నెల 21న నిర్వహించనున్న టోకెన్ సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. గురువారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం లాభాల్లో వాటా 32 శాతం కార్మికులకు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు ఓట్ల రాజకీయం కోసం చేసిన ఈ దుశ్చర్యను ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే కార్మికుల అకౌంట్లో 32 శాతం వేయాలని లేనిపక్షంలో 21 తారీకున సింగరేణి యావత్తు సమ్మె జరుగుతుందన్నారు. ఈ సమ్మెకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యమే వహించాలన్నారు. గతంలో సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇన్‌కం టాక్స్ రద్దుచేద్దాం అన్నారు. కాని చేయలేకపోయారని, కనీసం కోల్ ఇండియాలో, సింగరేణి అధికారులకు ఇచ్చినప్పుడు స్పేర్స్ పై అలివేన్సులు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని, ఇందులో ఒక్క హామీ అమలుపరచలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, బియ్యాల వెంకటస్వామి, దాసరి తిరుపతి గౌడ్, ఎస్ నాగేశ్వరరావు, మీనుగు లక్ష్మీనారాయణ, ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస, రాజేందర్, రత్నం మల్లయ్య, సీహెచ్ లింగయ్య, ఐ సంపత్, కోల కమలకర్, కామెర రాములు, రఘురాం, కే.మహేష్, బొద్దుల వెంకటేష్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డే ఆటాపాట వేడుకలు



నవతెలంగాణ-మందమర్రి

కుటుంబ సభ్యులంతా ఒకే దగ్గర చేరి ఆహ్లాదంగా గడపాలన్న ఉద్దేశ్యంతో నిర్వహించిన ఫ్యామిలీ డే ఆట పాట వేడుకలని ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఆధ్వర్యంలో సీఈఆర్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డే ఆట పాట వేడుకలను ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు సవిత మనోహర్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్యామిలీ డే ఆట పాట కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారని, ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, అధికారులకు, కార్మిక సంఘాల నాయకులకు, మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. సి అండ్ ఎండీ శ్రీదర్ ఆదేశాల మేరకు సద్దుల బతుకమ్మ వేడుకలను కుటుంబ సభ్యులు అందరూ ఒకే దగ్గర చేరి ఆహ్లాదంగా గడపాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ ఆట పాట కార్యక్రమానికి మహిళలందరూ తరలి రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. వేడుకలలో భాగంగా బతుకమ్మ ఆట, పాట బాంబే బ్లాస్ట్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజేశ్వర్ రెడ్డి, పీఎం శ్యాంసుందర్, డీవై పీఎం ఎండీ ఆసిఫ్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, మేనేజర్లు, సంక్షేమ అధికారులు, మహిళలు, సేవ సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో కాంగ్రెస్ మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జ్యోతి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎవరికి కాంగ్రెస్ టికెట్ వచ్చిన, నాయకులు కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పార్టీ గెలుపు కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. 6 గ్యారంటీ స్కీంలతో ప్రతి కార్యకర్త గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలుపాలన్నారు. ప్రస్తుతం ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలును నమ్మే పరిస్థితిలో లేనన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏనుగు సుభాష్‌రెడ్డి, మత్స్య శంకరయ్య, పసియుల్లా, మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, గంగన్న యాదవ్, కంటెం శంకర్, సుధాకర్ నాయక్, మహిళా నాయకురాలు టి.పంకజ, రాజేశ్వర్, రియాసాబ్ అలీ, బొంతల లక్ష్మణ్, ఆకుల సత్యన్నా, దుమల రమేష్, మామిడిపల్లి ఇందయ్యా నరసయ్య, పాసాల రాజేశం, రవి తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం పట్టుకున్నారు. అనుమానస్పదంగా తిరుగుతున్న అమరదీప్‌ని పట్టుకొని విచారించగా అతని వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. ఆయనపై కేసు నమోదు చేసినట్టు టూ టౌన్ ఎస్సై బన్సీలాల్ తెలిపారు. గంజాయి సరఫరా చేసిన, సేవించిన వారిపై కేసు నమోదుతో పాటు పీడీ యాక్టు పెడుతామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-తాండూర్

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పంచాయతీ సెక్రెటరీలను ఆదేశించారు. గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులలో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని సౌకర్యాలు సమకూర్చాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలోని విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రంలో ర్యాంపు ఉండే విధంగాచూసుకోవాలని తెలిపారు పోలింగ్ సిబ్బంది వచ్చినప్పుడు కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించి వాటి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఈజీఎస్ అధికారులకు సూచించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ నందకుమార్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

